## క్లుప్తంగా

### రోడ్డుపై బైఠాయించి గ్రామస్తుల నిరసన

**వీణవంక:** ఇసుక లారీలతో దుమ్ములేచి రోగాల బారిన పడుతున్నామని ఆరోపిస్తూ మండల కేంద్రంలో గ్రామస్తులు ఆందోళన చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. చల్లూరు, మామిడాలపల్లి మీదుగా వెళ్లాల్సిన ఇసుక లారీలు మండల కేంద్రం నుంచి వెళ్తుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపరీతమైన దుమ్ము లేవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఆసిఫ్ గ్రామస్తులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలుఏర్పడటంతో ఎస్సై లారీలతో మట్టి పోయించి గుంతలు లేకుండా తాత్కాలిక మరమ్మతు చేయించారు.

### 89 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

**చొప్పదండి:** సొసైటీ పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో వానాకాలం ధాన్యం 89 వేల క్వింటాళ్లు సంఘం ద్వారా కొనుగోలు చేశామని చొప్పదండి పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం సంఘం ఆవరణలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... రుక్మాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిలో గోదాం నిర్మించాలని తీర్మానించామని, సంఘంలో కొత్తగా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను అందించనున్నామని, రైతులు సకాలంలో అప్పులు చెల్లించి తిరిగి పొందాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ముద్దం మహేశ్‌గౌడ్, డైరెక్టర్లు, సీఈవో తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### భూ కబ్జాపై ఫిర్యాదు

**జమ్మికుంట:** మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామం రెండోవార్డు పరిధిలోని సర్వేనంబర్ 87లోని ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసిన విషయంపై స్థానిక కౌన్సిలర్ మారపల్లి భిక్షపతి శుక్రవారం తహసీల్దార్ రజనికి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన ఓవ్యక్తి అక్రమంగా స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేశాడని, భూ కబ్జాపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### నూతన కార్యవర్గం

**సైదాపూర్:** మండలంలోని వెన్నంపల్లిలో మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సాల్వరి తిరుమల్‌రావు తెలిపారు. అధ్యక్షురాలిగా నెల్లి మనీషా, ఉపాధ్యక్షురాలిగా రేగుల సుజాత, కార్యదర్శిగా పెసర మంజుల, కోశాధికారిగా పెసరు అలేఖ్య, డైరెక్టర్లుగా వనమాల, సరోజన, స్వరూప, రేణుక, శారద ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజు ఉపాధ్యక్షుడు పెసరు కుమారస్వామి, వెన్నంపల్లి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు నెల్లి శ్రీనివాస్, పెసరు కొమురయ్య, రేగుల తిరుపతి, చంద్రమౌళిలు ఉన్నారు.

### మొక్కులు చెల్లించిన కవ్వంపల్లి వీరాభిమాని

**మానకొండూర్:** కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలవడంతో ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలోని దర్గాలో మానకొండూర్‌కు చెందిన కొండ్ర రాంబాబు శుక్రవారం మొక్కులు చెల్లించాడు. అమ్మాజాన్, బాబాజాన్ దర్గాలో చాదర్ సమర్పించి కవ్వంపల్లి కుటుంబ సభ్యుల పేరుమీద ప్రార్థనలు చేశాడు. ఐదేళ్లు సమర్థవంతంగా సుపరిపాలన సాగించాలని వేడుకున్నట్లు తెలిపాడు. వెంట తడకపెల్లి రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

### పుస్తెమెట్టెలు అందజేత

**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని శాలపల్లి–ఇందిరానగర్ గ్రామానికి చెందిన పత్రి రాధా కుమార్తె సుమలత వివాహానికి శుక్రవారం సర్పంచ్ కొడూటి శారదప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వధువుకు పుస్తెమెట్టెలు అందజేశారు.

### తెలుగు ప్రజల చరిత్ర ఉమ్మడి కరీంనగర్‌లోనే ప్రారంభం

**కరీంనగర్‌సిటీ:** మన ప్రాచీన తెలుగు ప్రజల చరిత్ర ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభమైందని ఎస్ఆర్ఆర్ కాలేజీ చరిత్ర విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధాకర్ తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల–చరిత్ర విభాగం ఆధ్వర్యంలో కరీంనగర్–ఏ క్రెడిల్ ఆఫ్ శాతవాహన అనే ప్రాజెక్టులో భాగంగా ధూళికట్ట బౌద్ధ స్తూపం సందర్శించారు. ఎంతో గొప్ప ప్రాచీన చరిత్ర కలిగిన తెలుగు ప్రజల ప్రాభవం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభమైందని తెలిపారు. నాటి చరిత్రకు ఆనవాళ్లుగా ఎన్నో శిల్పాలు, లిపీలు లభించాయని పేర్కొన్నారు. తెలుగు ప్రజలకు మొదటి పాలకులు శాతవాహనులని, శాతవాహనుల పరిపాలన కేంద్ర బిందువు కరీంనగర్ జిల్లా కోటిలింగాల అని, బౌద్ధ స్తూపం ధూళికట్ట క్రీస్తు పూర్వం 2,200 సంవత్సరాల క్రితం నాటిదన్నారు. బౌద్ధమత స్తూపం, ప్రాకారాలు, ప్రాచీన అవశేషాలను గుర్తించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మ్యూజియం టెక్నికల్ అసిస్టెంట్ రవితేజ, అధ్యాపకులు ప్రవీణ, రామకిషన్, రాజేందర్, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు. విజయవంతంగా యాత్రను పూర్తి చేసిన అధ్యాపక, విద్యార్థుల బృందాన్ని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ అభినందించారు.

# ప్రజాధనం వృథా..

- నాలుగేళ్ల క్రితం చొప్పదండిలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నిర్మాణం
- రెండేళ్లుగా ఖాళీగా ఉంటున్న వైనం
- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఆఫీస్‌కు పూర్వ వైభవం వచ్చేనా..?



**చొప్పదండి:** చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో నిర్మించిన ఎమ్మెల్యే కార్యాలయం ఏళ్లుగా ఖాళీగా ఉంటోంది. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. చొప్పదండి పట్టణంలో వైద్యఆరోగ్యశాఖకు చెందిన స్థలంలో 2016లో క్యాంపు కార్యాలయం నిర్మాణానికి భూమిపూజ చేయగా 2018లో కార్యాలయం నిర్మాణం అసంపూర్తిగా ఉండగా ఆదరాబాదరగా ప్రారంభించారు.

## ఖాళీగానే ఉంటోంది..

2018లో ఎమ్మెల్యేగా గెలిచిన సుంకె రవిశంకర్ క్యాంపు కార్యాలయం పూర్తి చేయించారు. క్యాంపు కార్యాలయం అసంపూర్తిగా ఉండటంతో పాటు పలు వాస్తు మార్పులు చేసి రవిశంకర్ కార్యాలయాన్ని ఉపయోగించుకున్నారు. తన కుటుంబంతో ఇక్కడే నివాసం ఉంటూ మున్సిపల్ ఎన్నికల్లోనూ పాల్గొన్నారు. తన స్వగ్రామం బూర్గుపల్లిలో ఇంటి నిర్మాణం పూర్తికావడంతో ఆయన క్యాంపు కార్యాలయం ఖాళీ చేసి బూర్గుపల్లి వెళ్లిపోయారు. అప్పటి నుండి అడపదడపా సమీక్షలు నిర్వహించడానికి, చెక్కులు పంపిణీ చేయడానికి మినహా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని దేనికి ఉపయోగించలేదు.

## వినియోగంలోకి వస్తుందా..

తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మేడిపల్లి సత్యం కుటుంబంతో క్యాంపు కార్యాలయంలో ఉంటారా.. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కొనసాగుతారా అనేది ఆసక్తిగా మారింది. ఎన్నికల సమయంలో గంగాధర మండలంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి నుండే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గెలిచిన తర్వాత కూడా క్యాంపు కార్యాలయంలో అడుగు పెట్టలేదు. క్యాంపు కార్యాలయానికి భూమిపూజ చేసిన అప్పటి ఎమ్మెల్యే బొడిగె శోభ క్యాంపు ఆఫీస్ ప్రారంభించిన రోజే అప్పటి శాసనసభ రద్దు కావడం గమనార్హం. ఆపై అధికార బీఆర్ఎస్ తనకు టికెట్ కూడా నిరాకరించడంతో బీజేపీలో చేరి పోటీ చేసినా డిపాజిట్ కూడా దక్కలేదు. తాజా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కార్యాలయాన్ని సుందరీకరించి ఇక్కడే నివాసం ఉండేవారు. క్యాంపు కార్యాలయంలో ఉన్నన్ని రోజులు ఎంపీ ఎన్నికలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు, సహకార సంఘాల ఎన్నికలతో క్యాంపు కార్యాలయం కళకళలాడేది. పైగా అన్ని ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచేవారు. బూర్గుపల్లిలో స్వగృహ నిర్మాణం చేసి అందులోకి గృహప్రవేశం చేశాక జరిగిన ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓటమి చెందడం కూడా చర్చనీయాంశమైంది. ప్రస్తుత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కరీంనగర్‌లోనే ఉంటారా.. క్యాంపు కార్యాలయంలో అడుగుపెడతారా అనేది తెలియడానికి మరికొద్ది రోజులు వేచి చూడాలి.

# ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న రొడ్డ పద్మారాణి



చొప్పదండిలో విరాళం అందిస్తున్న దాతలు

**చొప్పదండి:** పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి భక్తులు శుక్రవారం రూ.20 వేల విరాళం ఇచ్చారు. రాంనగర్‌కు చెందిన గుర్రం జయప్రద, మల్లారెడ్డి దంపతులు రూ.10,116, వివేకానంద చౌరస్తాకు చెందిన గుర్రం దేవేంద్ర, మల్లారెడ్డి దంపతులు రూ.10,116 విరాళం ఆలయ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో చైర్మన్ బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉస్కె రాజశేఖర్ రెడ్డి, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మానకొండూర్:** మండల కేంద్రంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, అభయాంజనేస్వామి ఆలయ అభివృద్ధి కోసం శివాని ఫౌండేషన్ ద్వారా రూ.1.16 లక్షల చెక్కును శుక్రవారం ఫౌండేషన్ చైర్మన్ రొడ్డ పద్మారాణి, యాదగిరి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. మానకొండూర్ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్ సోదరి సాయిశివాని జ్ఞాపకార్థం ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పద్మారాణియాదగిరిని శాలువాతో ఘనంగా సన్మానించారు. విరాళం ఆలయ అభివృద్ధి కోసం వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో వనపర్తి బ్రహ్మయ్య, కటుకోజ్వాల శ్రీనివాస్, నందగిరి శ్రీనివాస్, మడుపు ప్రేమ్‌కుమార్, నందగిరి నాగాంజనేయులు, వనపర్తి వీరబ్రహ్మం, రామోజు వెంకట సిద్ధార్థచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు వివరించాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

**రామడుగు:** రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ కోరారు. మండలంలోని కోరటపల్లి గ్రామంలో శుక్రవారం ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మణ్ ఇంటివద్ద ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పేదల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు వీర్ల సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం




విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

**జమ్మికుంట:** మండలంలోని గండ్రపల్లి గ్రామం సాంఘిక, సంక్షేమ గురుకుల (బాలికల)పాఠశాలలో వావిలాల పీహెచ్‌సీ వైద్యాధికారి కుడిసియ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 300 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీ డాక్టర్ ఫర్హాన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సూపర్‌వైజర్ స్వరూప, ప్రిన్సిపల్ మంజుల, వైద్యసిబ్బంది మణెమ్మ, రామకృష్ణ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

# సీహెచ్‌సీలో డాక్టర్‌ను నియమించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిలుక రవీందర్

**చొప్పదండి:** పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో తక్షణమే రెసిడెంట్ డాక్టర్‌ను నియమించి చేసి రోగులకు వైద్యసేవలు అందించాలని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. జన ఆరోగ్య సమితి త్రైమాసిక ప్రత్యేక సమావేశం శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే రోగులకు చికిత్స అందించి ఆసుపత్రికి ప్రత్యేకత తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో స్వరూప, డాక్టర్ రాజేశ్, సీహెచ్‌వో ప్రసాద్, ఐకేపీ ఏపీఎం నర్మద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సౌమ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగులతో ఎస్ఈ సమీక్ష



మాట్లాడుతున్న కరీంనగర్ ఎస్ఈ గంగాధర్

**జమ్మికుంట:** పట్టణ, మండల పరిధిలోని రైతులు వ్యవసాయబావులు, ఇంటి విద్యుత్ బిల్లుల బకాయిలు సకాలంలో చెల్లించాలని కరీంనగర్ ఎస్ఈ గంగాధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్, 33/కేవీ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా అందించే అవకాశం ఉందని, మీటర్లు లేనివారు దరఖాస్తు చేసుకొని మీటర్లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ రాజేందర్, ఏఈలు, సబ్ ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పోలీస్ ఆఫీసర్స్, సిబ్బంది

## ఆత్మీయ సమ్మేళనం

**హుజూరాబాద్‌రూరల్:** ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి సక్రమంగా విధులు నిర్వహించారని కరీంనగర్ అడ్మినిస్ట్రేషన్ డీసీపీ రాజు అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించినందుకు కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశానుసారం సబ్‌డివిజన్ పోలీస్ స్టేషన్‌పరిధిలోని పోలీస్ అధికారులతో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ హాజరై మాట్లాడారు. ఎన్నికల వేళ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించటంతోనే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న సంఘం అధ్యక్షుడు, సభ్యులు

**చిగురుమామిడి:** మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన వేచిని విజయ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి భార్య వరలక్ష్మీకి ఆదర్శ పురుషుల పొదుపు సంఘం నుంచి రూ. 94,968, మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన చాట్ల హన్మయ్య భార్య లచ్చవ్వకు రూ.78,298 గురువారం సంఘం అధ్యక్షుడు తాడ వాసుదేవరెడ్డి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మామిడి శ్రీనివాస్, సమితి అధ్యక్షుడు అనగోని వీరన్న, ఘణకులు పెండెలా గురువయ్య, పాలకవర్గ సభ్యులు ముత్యాల ఓదేలు, మడమడకల రాజిరెడ్డి, విజ్జగిరి సంపత్, దరిపెల్లి రమేశ్, వామసాని వేణు, మ్యాదర స్వామి, పెద్దపల్లి రవీందర్ పాల్గొన్నారు.

**వీణవంక:** మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఒడ్డెపల్లి పర్వతాలు అనారోగ్యంతో మృతిచెందగా సర్పంచ్ పోతుల నర్సయ్య అంత్యక్రియలకు రూ.రెండువేలు అందించారు. వెంట నాయకులు భూమయ్య, రాజయ్య, అంబాల మధు, అరుణ, సమ్మయ్య, ఒడ్డెపల్లి రాజయ్య, అంబాల మల్లేశ్ ఉన్నారు.

**నిరుపేద కుటుంబానికి సాయం**

**చొప్పదండి:** మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం మొగిలిపేట శంకర్ కూతురు వివాహానికి ఇబ్బందులు పడుతుండటంతో మాజీ సర్పంచ్ మునిగాల సుదీష్ణ సుధాకర్‌గౌడ్ శుక్రవారం రూ.5 వేలు అందించారు. పేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

## గ్రామీణ గ్రంథాలయ నిర్వాహకుడి మృతి



తిరుపతిరెడ్డి(ఫైల్)

**రామడుగు:** మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ గ్రామీణ గ్రంథాలయం నిర్వాహకుడు పిండి తిరుపతిరెడ్డి శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దివ్యాంగుడైనా తిరుపతిరెడ్డి నిత్యం గ్రంథాలయ నిర్వహణ చేసేవాడని తెలిపారు. తిరుపతిరెడ్డి మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

# పాఠశాలను పరిశీలించిన జెడ్పీటీసీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గీకురు రవీందర్

**చిగురుమామిడి:** మండలంలోని నవాబ్‌పేట జెడ్పీహెచ్ఎస్‌ను జెడ్పీటీసీ గీకురు రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థులు తినే ఆహారం నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్టుగా వండాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బోయిని పద్మ, హెచ్ఎం రాజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్, బోయిని వంశీకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఠాకూర్ రాణాప్రతాప్‌సింగ్, బోయిని వేణుగోపాల్, పిల్లి తిరుపతి, బోయిని విజయ్‌కుమార్, ఎన్నం నిఖిల్ పలువురు ఉన్నారు.

# ఫైర్ సర్వీసులపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆఫీసర్లు

**హుజూరాబాద్‌రూరల్:** ఎన్‌సీసీ విద్యార్థులు శిక్షణ అంశాలపై సమగ్రంగా అవగాహన పెంచుకోవాలని ఎన్‌సీసీ కమాడింగ్ ఆఫీసర్ డేనియల్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఫైర్ సర్వీసులపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో క్యాంపు కమాడెంట్ కెప్టెన్ రవీంద్రబాబు, ఆఫీసర్ సుబేదార్ సాగర్‌సింగ్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు శ్రీలత మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్, మంగమ్మ పాల్గొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పుస్తకం ఆవిష్కరణ



పాఠశాలలో పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎండీ నసిరొద్దీన్, తదితరులు

**కరీంనగర్:** జిల్లా కేంద్రంలోని సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హిందీ పండిట్ మంజురున్నిసా షబానా విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించుట, పుస్తక సమీక్షలకు ఉపయోగపడేలా 50 హిందీ కథలను అద్భుత్ కహనియా కా సఫర్ అనే పుస్తకాన్ని స్వయంగా రూపొందించారు. శుక్రవారం సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఎండీ నసిరొద్దీన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్, కొత్తపల్లి మండలంలోని హిందీ భాషోపాధ్యాయులు పాల్గొన్నారు.

## సరస్వతి ఆలయంలో గోమాత పూజలు



సరస్వతి ఆలయంలో గోమాత పూజలు

**చొప్పదండి:** పట్టణంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో గోమాత పూజలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ప్రధాన అర్చకులు సింహాచలం జగన్‌మోహన్ స్వామి, భాష్యం నవ్యకుమార్ తెలిపారు. అమ్మవారి గుడితో పాటు లలితాదేవీ, లక్ష్మి దేవీలకు ప్రత్యేక మందిరాలు, ఆలయ ప్రాంగణంలో విఘ్నేశ్వర మంటపం పంచముఖ ఆంజనేయస్వామి, మానసాదేవీ అమ్మవార్ల మంటపాలను ఏర్పాటు చేశామని తాజాగా ఆలయ ప్రాంగణంలో గోమాత సేవలను అందుబాటులోకి వచ్చాయన్నారు. భక్తులు తరలివచ్చి గోమాత సేవలను పొందాలని కోరారు.